



హరికథ కళాకారిణి ఉమామహేశ్వరిని వరించిన 'పద్మశ్రీ'

కపిలేశ్వరపురం హరికథ పాఠశాల నుంచే ఆమె ప్రస్థానం

... వివరాలు మెయిన్‌లో

కన్నీళ్లు రాకుండా చూస్తాం : ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామానికి చెందిన సలాది విశ్వనాథం భార్య ఆదిలక్ష్మి భువనేశ్వరిని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఆమెను పక్కనే కూర్చుని భువనేశ్వరి ఓదార్చారిలా..



బాధపడకండి.. మేమున్నాం!

బాధిత కుటుంబీకుల కన్నీళ్లు తుడిచి.. బాసటగా నిలిచి..

మీకు అండగా మేమున్నాం.. మాకు అండగా మీరున్నారు.. మీకు కష్టం వచ్చిందంటే మేం తట్టుకోలేం.. మాకు కష్టం వచ్చిందంటే మీరు తట్టుకోలేరు.. అందుకే చంద్రబాబును అక్రమంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేసి జైలులో పెడితే తట్టుకోలేక వందలాది మంది తుదిశ్వాస విడిచారని ఎన్టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' పేరిట చేపట్టిన యాత్రలో భాగంగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గురువారం ఆమె ఏడు బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరామర్శించి ఓదార్చారు. ఒక్కొక్కరికీ రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు. తొలుత అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్, మాజీ ఎమ్మెల్యేలు అయితా బత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, చిల్లా జగదీశ్వరి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర నేతలు మెట్ల రమణబాబు, అల్లాడ స్వామినాయుడు తదితరులు భువనేశ్వరిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

- (అమలాపురం/ఆంధ్రజ్యోతి)

- కోనసీమలో 7 కుటుంబాలకు పరామర్శ
- అండగా ఉంటామని భువనేశ్వరి భరోసా
- రూ.3 లక్షల చొప్పున చెక్కుల అందజేత

నేడు టూర్ ఇలా...

నిడదవోలు/బిక్కవోలు, జనవరి 25: 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తూర్పుగోదావరి జిల్లాలో నారా భువనేశ్వరి పర్యటించనున్నారు. మండపేటలో గురువారం రాత్రి ముగించుకుని బిక్కవోలు మండలం బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బస చేశారు. శుక్రవారం ఉదయం బిక్కవోలులోని శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రొక్కల రాణి కుటుంబీకులను పరామర్శిస్తారు. నిడదవోలు మండలం చేరుకుని పందలపర్రు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోగిరెడ్డి సత్యనారాయణ (బూరయ్య), తిమ్మరాజుపాలెంలో కుసుమే వెంకటలక్ష్మి, కలవచర్లకు చెందిన మన్నెం శ్రీనివాసరావు కుటుంబీకులను ఓదార్చుతారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో మరో కుటుంబాన్ని పరామర్శిస్తారు.

అల్లవరంలో.. సుబ్బరాజు కుటుంబానికి..



అల్లవరం, జనవరి 25: మండలంలోని రెల్లుగడ్డ గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని, ఉపాధి కూలీ నడింపల్లి సుబ్బరాజు గతేడాది అక్టోబరు 1న చంద్రబాబు అరెస్టు వార్తను టీవీలో చూసి గుండెపోటుతో మృతిచెందాడు. అతడి కుటుంబీకులను భువనేశ్వరి గురువారం పరామర్శించి ఓదార్చారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ జడ్పీటీసీ వేగిరాజు ప్రమీల, పెచ్చెట్టి విజయలక్ష్మి, డాక్టర్ సత్యశ్రీ, వేగిరాజు వెంకట్రాజు, చిక్కాల గణేష్ పాల్గొన్నారు.

చల్లపల్లికి వెళ్లి.. ఓదార్చి..

ఉప్పలగుప్తం: చంద్రబాబు జైల్లో ఉండగా ఆందోళనతో మృతి చెందిన చల్లపల్లి గ్రామానికి చెందిన సలాది విశ్వనాథం భార్య ఆదిలక్ష్మి, ముగ్గురు కుమార్తెలను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, గొలకోటి చిన్నా, పోలిశెట్టి శివాజీ, దంగేటి రవీంద్రనాథ్, బూసి బుజ్జిదొర, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎస్ మూలపాలం వెళ్లి.. పరామర్శించి



అయినవిల్లి: మండలంలోని ఎస్.మూల పాలం గ్రామానికి చెందిన మోరంపూడి మీరాసాహెబ్ కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. అండగా ఉంటామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ఆమె వెంట మతుకుమిల్లి లక్ష్మణరావు, సూర్యకుమారి, సర్పంచ్ బొబ్బా ప్రభాత్‌కుమార్, మతుకుమిల్లి బాబూరావు, మందపాటి కిరణ్ కుమార్, సలాది పుల్లయ్యనాయుడు తదితరులు ఉన్నారు.

గూడపల్లి వెళ్లి కన్నీళ్లు తుడిచి..



రాజోలు: మండలంలోని గూడపల్లికి చెందిన సరెళ్ల పెద్దిరాజు కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించారు. ఆమె వెంట మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, టీడీపీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, ఎంపీపీ కేతా శ్రీను, మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, వైస్ ఎంపీపీ పాలమూరి శ్యామ్‌బాబు, చాగంటి స్వామి, బోళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నల్లూరు వెళ్లారు.. ఓదార్చారు..



కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరులో జొన్నకూటి రాజు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. టీడీపీ అన్నా, చంద్రబాబు అన్నా రాజుకు అమితమైన ప్రేమ, అభిమానమని, ఎప్పుడూ చంద్రన్ననే తలుస్తూనే ఉండేవాడని కుటుంబీకులు భువనేశ్వరికి వివరించారు. ఆమె వెంట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, వి.సాయికుమార్‌బాబు, ముత్యాల వెంకట్రావు, పుత్సల శ్రీనివాస్, పువ్వల చిట్టిబాబు, నెక్కంటి బాలకృష్ణ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



మలికిపురం : విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన చెల్లుబోయిన నరసింహ మూర్తి కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించారు. 'నవంబరు 9న టీవీ ఆన్‌చేసి చంద్రబాబు అరెస్టు వార్త చూసి కుప్పకూలారని మృతుడి కుమారుడు చంద్రకాంత్ తెలిపారు. ధైర్యంగా ఉండాలని, టీడీపీ అండగా ఉంటుందని భువనేశ్వరి వారికి భరోసా ఇచ్చి రూ.3 లక్షల చెక్కు అందించారు. ఆమె వెంట మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, గ్రామ సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా, సఖినేటిపల్లి టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని, మంగెన భూదేవి, బందెల పద్మ, కాండ్రేగుల భవానీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

పాలతోడు.. మేము మీకు తోడు..



మండపేట: మండలంలోని పాలతోడులో మందపల్లి ధర్మరాజు కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించారు. ఆయన సతీమణి జ్యోతితో పాటు పిల్లలు వినీల, ప్రమీల కుమారుడు వరుణ్‌తో భువనేశ్వరి మాట్లాడి ధైర్యం చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తమ కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని బాధిత కుటుంబం కోరగా భువనేశ్వరి సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వల్లూరి సాయికుమార్‌బాబు, నల్లమిల్లి వీర్రెడ్డి, వాదా ప్రసాదరావు, యరగతపు బాబ్జీ, పాలతోడు మాజీ సర్పంచ్ పిల్లా పద్మవెంకట్రాజు ఉన్నారు.



కాకినాడలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

కష్టపడితే అధికారం కాంగ్రెస్‌దే!

- అసెంబ్లీ ఎన్నికలు దగ్గరకొస్తున్నందున అందరూ కష్టపడి పనిచేయాలి
- ప్రతి ఇంటి తలుపుతట్టి కేడర్‌ను పార్టీలోకి ఆహ్వానించాలి
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పోలవరం ప్రాజెక్టు, రాజధాని, ప్రత్యేక హోదా
- రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం.. అంతా అరాచక పాలన నడుస్తోంది
- ఉమ్మడి జిల్లా పార్టీ కార్యకర్తల సమావేశంలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

కాకినాడ సిటీ, జనవరి 25: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి ఇంటి తలుపు తట్టి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించాలని దిశానిర్దేశం చేశారు. కాకినాడ సూర్యకళామందిరంలో గురువారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పీసీసీ చీఫ్ షర్మిల కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ క్రమేపీ పెరుగుతోందని, దీనిని ఓట్లుగా మల్చుకోగలిగితే తప్పకుండా అధికారంలోకి వస్తామని పేర్కొన్నారు. విభజన హామీలు అమలుచేసి రాష్ట్రానికి న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రారంభమైతే ఇప్పటివరకు ప్రభుత్వాలు దీన్ని పూర్తిచేయలేదని షర్మిల ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదని, రాజధాని లేదని, పరిశ్రమలు కూడా రాక అటు ఇటు కాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా శూన్యమని, అరాచక, రాక్షస పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. వైసీపీతోపాటు ప్రతిపక్ష టీడీపీ ఎంపీలు రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు కూడా గెలవని బీజేపీకి బానిసలుగా మారిపోయారని మండిపడ్డారు. రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సంక్షేమ, సుస్థిర పాలన అందుతుందని అందుకే కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకున్న ఆంధ్రప్రదేశ్ ఇది కాదని, విభజన హామీలలో పొందుపరిచిన విధంగా ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, కొత్త పరిశ్రమల ఏర్పాటుతో ఆవిష్కృతం కావాలని సోనియా, రాహుల్ భావించారన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు జేడీ శీలం మాట్లాడుతూ పార్టీ శ్రేణులు మండల, గ్రామ, బూత్ లెవెల్ కమిటీలు ఏర్పాటుచేయాలన్నారు. ఎన్నికల్లో తూర్పుగోదావరి జిల్లా ప్రజలు ఏ పార్టీని ఆదరిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో అధికా రంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే మంచిరోజులు రాబోతున్నట్టు చెప్పారు. ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో దోచుకోవడం, దాచుకోవడం తప్పించి పరిపాలన లేదన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు మల్లిపూడి మంగపతి పళ్లంరాజు మా ట్లాడుతూ పదేళ్ల కాంగ్రెస్ పాలనలో సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి సమాంతరంగా జరిగాయని వివరించారు. కానీ ఇప్పుడు అదంతా మాయమైపోయిందన్నారు. అనంతరం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొందరు పార్టీ మండల అధ్యక్షులు ప్రసంగించారు. ఈ సమావేశంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, ఏఐసీసీ సభ్యు డు మల్లిపూడి రాంబాబు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, రాజమహేంద్రవరం జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా ప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు ఆకుల వెంకటరమణ, ఎండీ ఇస్మాయిల్ ఆరిఫ్, కోలా ప్రసాదవర్మ, కుక్కల పోతురాజు, అయితాబత్తుల సుభాషిణి, కాకినాడ సిటీ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, రాజమహేంద్రవరం సిటీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లితో వైఎస్ షర్మిల భేటీ



రాజమహేంద్రవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ ఇంటికి వచ్చారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, జేడీ శీలం, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తదితరులు ఆమె వెంట ఉన్నారు. ఉండ వల్లితో ఆమె ప్రత్యేకంగా సమావేశమై పలు విషయాలు చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మర్యాదపూర్వకంగా అరుణకుమార్‌ని కలిశానన్నారు. అనంతరం ఉండవల్లి స్పందిస్తూ వైఎస్ కుమార్తెగా ఆమె తనను మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చారన్నారు. కాకినాడ నుంచి వెళుతూ రాజమహేంద్రవరం వచ్చారన్నారు. ఆమెలో వైఎస్సార్ చొరవ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.



సీనియర్ సిటిజన్లను సత్కరించిన కలెక్టర్, ఎస్పీ శ్రీధర్

ఓటుకు నోటు భవిష్యత్తుకు చేటు

- జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్, జనవరి 25: ఓటుకు నోటు భవిష్యత్తుకు చేటని.. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు ద్వారా ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా యువ ఓటర్లకు పిలుపునిచ్చారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. ఓటుకు నోటు చివరకు ప్రజాస్వామ్యానికి చేటుతెస్తుందన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆవిర్భావ దినోత్సవమైన జనవరి 25న ప్రతిఏటా ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. బాధ్యత గల పౌరులుగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా మంచి వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నదీ లేనిదీ ఆన్‌లైన్‌లో పరిశీలించుకోవాలన్నారు. 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక దానిని చూపించి ఓటు వేయాలన్నారు. సంబంధించిన అపరాధ ఫిర్యాదులపై సి-విజిల్ యాప్ ద్వారా ఉన్నతాధికారులకు సమాచారం అందించవచ్చన్నారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల సార్వభౌమాధికారానికి ఎన్నికలు ఒక గుర్తు అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత యువ ఓటర్లపై ఎక్కువగా ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ ఓటు విశిష్టతను వివరించారు. ఓటర్ల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలను అధికారులు పరిశీలించి విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. రంగోలి, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. చివరగా సీనియర్ సిటిజన్లు అయిన ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కమిషనరు వి.అయ్యప్పనాయుడు, డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజే రామారావు, ఏవో జక్కం వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.

పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి

అమలాపురం తహసీల్దారు కార్యాలయం ఎదుట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా

అమలాపురం రూరల్, జనవరి 25: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు పారుపూడి కృష్ణశాస్త్రి కోరారు. డీఆర్, వేతన సవరణ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు వృద్ధాప్యంలో ఉన్న తమకు ప్రతినెలా ఒకటో తేదీనే పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ అమలాపురం తాలూకా కేంద్రమైన తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కృష్ణశాస్త్రి అధ్యక్షతన జరిగిన శిబిరంలో భాగంగా తొలుత ఎన్టీఆర్ మార్గ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వినతిపత్రం అందజేశారు. మహానుభావా మా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వానికి మంచి మనసు ప్రసాదించమని వేడుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా ధర్నా శిబిరానికి చేరుకున్నారు. వయో వృద్ధులైన పెన్షనర్లు అపరిష్కృత సమస్యల పరిష్కారానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయివరప్రసాదరావు మాట్లాడుతూ సూపర్ సీనియర్ పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పెంచాల్సిన పరిస్థితిని వివరించారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని డిమాండు చేశారు. ధర్నా శిబిరాన్ని జేఏసీ నాయకులు డి.పృథ్వి, చాముండేశ్వరి, శ్రీనివాస్, కోదండరామయ్య, విశ్రాంత అధ్యాపకుల సంఘం నాయకులు రవీంద్ర, రామాంజనేయులుతో పాటు పలువురు సందర్శించి సంఘీభావం తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు మాట్లాడుతూ 2018 నుంచి చెల్లించాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 29న జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 5న రాష్ట్రస్థాయిలో ధర్నాలు నిర్వహిస్తామని కోశాధికారి జేఎస్ శర్మ హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు పరమట శ్రీపల్లవి, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి రంగారావులకు వినతిపత్రాలు అందజేశారు. ధర్నా శిబిరంలో సూపర్ సీనియర్లు ఎన్‌సీహెచ్ కృష్ణమూర్తి, కేఎస్వీ సత్యనారాయణ, అల్లు వీర వెంకట సత్యనారాయణ, ఏఎస్ఎస్ ప్రకాశం, చిక్కం సూర్యనారాయణ, మండలీక ఆదినారాయణ, షాహీరా, శ్రీగిరి పద్మావతి, కలిగినీడి ఉదయభాస్కర్, మంగిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు





కాపు నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న నాగబాబు

వచ్చే ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాలి

కాపుల ఆత్మీయ సమ్మేళనంలో నాగబాబు పిలుపు

అమలాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన సంఘటితంగా పనిచేయడంలో కాపులు కీలక పాత్ర పోషించాలని జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లాలోని వివిధ నియోజక వర్గాలకు చెందిన పార్టీలోని కాపు నాయకులతో గురువారం తాటిపాకలోని సోమిశెట్టి ల్యాండ్ మార్కులో నిర్వహించిన కాపుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గానికి 30 మంది కాపు కీలక నేతలను ఈ సమావేశానికి ఆహ్వానించి ఒక్కొక్క నియోజకవర్గం నుంచి ఇద్దరిని పార్టీ పరిస్థితిపై మాట్లాడాల్సిందిగా నాగబాబు సూచన చేశారు. ఆ విధంగానే జనసేనలోని పార్టీ కాపు నేతలు తమ మనోగతాన్ని ఆవిష్కరించారు. పార్టీ ఎక్కువ స్థానాలు గెలిచే విధంగా మీరంతా ప్రయత్నిస్తే రానున్న రోజుల్లో జనసేనకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. దీని దృష్ట్యా ప్రతి ఒక్కరూ కష్టించి పని చేయాలని సూచించారు. జనసేనలో అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేసుకుంటూ ముందడుగు వేయడంలో కాపులు కీలకంగా పని చేయాల్సిందిగా నాగబాబు సూచించారు. అయితే కులపరమైన సమావేశం కావడంతో సమావేశం హాలులోకి వచ్చేవారు ఎవరూ కూడా సెల్‌ఫోన్లు తీసుకు రాకుండా కట్టడి చేశారు. మీటింగ్ హాలుకు ముందు హాజరయ్యే వారి ఫోన్లను తీసుకుని బయటే భద్రపరిచారు. లోపల జరిగే సమావేశం వివరాలు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాపుల ఆత్మీయ సమ్మేళనం అనంతరం నాగబాబు రాజమహేంద్రవరం బయల్దేరి వెళ్లారు.



ట్రయల్ రన్‌లో భాగంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీధర్

గణతంత్ర వేడుకులకు ముస్తాబు

అమలాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణత్రంత వేడుకలకు అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియం ముస్తాబయ్యింది. ఎస్పీ ఎస్.శ్రీధర్ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ట్రయల్ రన్‌లో భాగంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రిపబ్లిక్ డే పరేడ్‌ను వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్‌ను మువ్వన్నెల జెండాలు, విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.





జీఎంసీ బాలయోగి స్టేడియంలో వేదిక (పైన), ముస్తాబైన కలెక్టరేట్ (కింద)



'సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏ మాత్రం సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరో సారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే' - సుప్రీంకోర్టు



'మీరు మంచిగా మారండి. బయటకు వెళ్లిన తర్వాత మీ కుటుంబాలతో గౌరవంగా, సంతోషంగా బతకాలి. మళ్లీ నేరాలు చేయకూడదు. క్షమాభిక్ష జీవోల కోసం ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. వాటి సంగతి నేను చూసుకుంటాను'

- రాజమహేంద్రవరం జైలులో ఆసుపత్రి శంకుస్థాపనకు వచ్చినప్పుడు ఖైదీలతో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు

ఖైదీలకు మళ్లీ కన్నీరేనా!

- విడుదల కోసం జైలు పక్షుల ఎదురు చూపులు
- గణతంత్ర దినోత్సవానికి క్షమాభిక్షపై అయోమయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'క్షమ' లేని పాలకుల దయా'భిక్ష' దొరక్క సత్ప్రవర్తన కలిగిన ఎందరో ఖైదీలు జైళ్లలోనే మగ్గిపోతున్నారు. క్షమాభిక్ష జీవో కోసం చివరి క్షణం వరకూ ఎదురుచూడటం.. ప్రభుత్వం కనికరం చూపకపోవడంతో నిరాశ నిండిన గుండెలతో కన్నీటిని దిగమింగుకొంటూ.. ఆహారం సయించక.. కంటిపై కునుకు రాక.. ఇటు ఖైదీలు.. అటు వారి కుటుంబాలు తీవ్ర మానసిక ఒత్తిడిలో మునిగిపోతున్నాయి. అయినా ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు. గత ప్రభుత్వంలో సమయానికి క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక గత నాలుగున్నరేళ్లలో ఒక్కసారి మాత్రమే జీవో ఇచ్చారు. జైలు అధికారులు ఎంత వేగంగా ప్రక్రియ పూర్తిచేసి జాబితాను పంపుతున్నా నెలల తరబడి తాత్సారం జరుగుతోంది. పాలకుల నిర్దయతో గతేడాది ఆగస్టు 15న విడుదల కావాల్సిన జీవిత ఖైదీల జాబితా ఇంకా సర్కారు వద్దే నానుతోంది. దీంతో ఈ గణతంత్ర దినోత్సవానికి వెలువడే నిర్ణయం జైళ్లలోని జీవిత ఖైదీలు ఎదురు చూస్తున్నారు.

రాజమహేంద్రవరం జైలులో...

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న వారిలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2023 మార్చి 16న జీవో 58 ఇచ్చింది. దీని ప్రకారం ఏడాదికి మూడు విడతల్లో ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం వడపోత అనంతరం 34మంది క్షమాభిక్షకు అర్హులని జైలు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వీరంతా గత ఆగస్టులోనే విడుదల కావాల్సి ఉంది. హైపవర్ కమిటీ సమావేశం పూర్తయి సుమారు 3 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటికీ ఆ జాబితాను కేబినెట్‌లో పెట్టలేదు.

ప్రభుత్వం తీరుతో అన్యాయం

గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. రెండేళ్లకోసారైనా పెద్దసంఖ్యలో ఖైదీలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేవారు. కానీ జగన్ ప్రభుత్వంలో వారికి ఎదురుచూపులే మిగిలాయి. గడిచిన నాలుగున్నరేళ్లలో ఒక్కసారి మాత్రమే క్షమాభిక్షపై ఖైదీలను విడుదల చేశారు. అప్పట్లో సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక జైలులో కలిపి సుమారు 60 మందికిపైగా బయటకు వెళ్లారు. అక్కడా వారికి అన్యాయమే జరిగింది. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ ఖైదీలను వెంటనే విడుదల చేయలేదు. ఏడాది ఆలస్యంగా 2022 ఆగస్టు 15న బయటకు వదిలారు. మరో అన్యాయం ఏమిటంటే.. 2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలాకాకుండా 2022నే కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరే అవకాశం లభించేది. ప్రభుత్వం తీరుతో ఆ ఖైదీలు ఏడాది శిక్ష అదనంగా అనుభవించారు.

ఖైదీ కుటుంబంపై ప్రతికూల ప్రభావం

సాధారణ జీవిత ఖైదీలకు 7ఏళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి తీవ్రమైన నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65ఏళ్లు దాటినవారికి ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు పూర్తిచేస్తే, కొన్ని నిబంధనలకు లోబడి క్షమాభిక్షకు అర్హులవుతారు. ప్రస్తుతం 15ఏళ్లకు పైబడి శిక్ష అనుభవిస్తున్నవాళ్లు, రెమిషన్‌తో కలిపి 20ఏళ్లు దాటిపోయిన ఖైదీలు, 65ఏళ్లు నిండిన వృద్ధులు ఉన్నారు. క్షమాభిక్ష జీవో జారీలో తీవ్ర నిర్లక్ష్యంతో వారి కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. కొన్ని కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు అంతకుముందు ఎలాంటి నేర చరిత్ర ఉండదు. క్షణికావేశంలోనో, స్నేహితులతో వెళ్లి లేదా ఏదో గొడవ పెద్దదై నేరం జరిగి ఉంటుంది. అలాంటి కేసుల్లోని వారు కూడా ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. కొన్ని కేసుల్లో భార్య, భర్త ఇద్దరికీ శిక్ష పడటంతో వారి పిల్లలు అనాథలవుతున్నారు. దేశంలో సంచలనం రేకెత్తించిన కేసుల్లో సైతం క్షమాభిక్ష ప్రసాదిస్తున్నారని.. క్షణికావేశంలో నేరానికి పాల్పడినవారిపై మాత్రం దయ చూపట్లేదని ఖైదీల కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. ఖైదీ సత్ప్రవర్తనను దృష్టిలో ఉంచుకొని క్షమాభిక్ష ప్రసాదించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రామయ్య దర్శనానికి రైలెప్పుడు?

- ప్రత్యేక రైళ్లు ఉన్నట్లా.. లేనట్లా..
- ప్రకటించినా.. రిజర్వేషన్లు తెరుచుకోలేదు
- అయోమయంలో రామభక్తులు
- స్పష్టత ఇవ్వని రైల్వే



టిక్కెట్స్‌కు ట్రై చేస్తే వస్తున్న మెసేజ్

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రామయ్య దర్శన భాగ్యం పొందాలని భక్తులు ఎదురుచూస్తున్నా రైల్వే శాఖ ప్రత్యేక రైళ్ల విషయంలో స్పష్టత ఇవ్వకపోవడంతో అయోమయం నెలకొంది. అయోధ్యకు నేరుగా వెళ్లడానికి 23న ప్రత్యేక రైలు ప్రకటించినా రిజర్వేషన్లు ఇంకా ఓపెన్ కాలేదు. అటు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైటులో వేలాదిగా భక్తులు వెతుకుతుండగా.. ఇటు రిజర్వేషన్ కౌంటర్ల వద్ద లైనులో నుంచుని తీరా రిజర్వేషర్ కావడం లేదని తెలియడంతో నిరాశతో భక్తులు వెనుదిరుగుతున్నారు. ప్రత్యేక రైలు కోసం భక్తులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అయోధ్య వెళ్లడానికి ఈ ప్రాంతం నుంచి నేరుగా రైలు లేదు. విమాన సదుపాయం ఉండదు. ధనబాద్, ప్రయాగ్ రాజ్, వారాణసీ, లక్నో తదితర స్టేషన్లకు వెళ్లి అక్కడి నుంచి రైలు మారాల్సి ఉంటుంది. ఆయా రైళ్లకు సాధారణ ప్రయాణికులతో రిజర్వేషన్లూ నిండుకున్నాయి. ఒకవేళ ఆ రైళ్లకు వెళ్లాలన్నా టిక్కెట్లకు డబ్బులు కూడా కాస్త ఎక్కువగా వెచ్చించాల్సి ఉండడంతో పాటు ప్రయాణ సమయం, ప్రయాస కూడా ఎక్కువగానే ఉంటుంది. దీంతో నేరుగా వెళ్లే ప్రత్యేక రైలు కోసం ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించిన 22వ తేదీన దేశం నలుమూలల నుంచి ఒకేసారి జనం అయోధ్యకు పోటెత్తితే ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో భక్తులను నియంత్రించడానికి రాష్ట్రాల వారీగా తేదీలు నిర్ణయించి ఆయా ప్రాంతాల నుంచి నేరుగా ప్రత్యేక రైలు సదుపాయం కల్పించాలని సంకల్పించారు. ఈ ప్రత్యేక రైళ్లను రానుపోను నడిపే విధంగా ప్రణాళికలు వేశారు. ఈ క్రమంలో అయోధ్య బాల రాముడిని దర్శించే భక్తుల సౌకర్యార్థం ఫిబ్రవరి 7, 10, 11, 14 తేదీల్లో రాజమండ్రి నుంచి అయోధ్యధామ్‌కి ప్రత్యేక రైలు 07217 నంబరుతో 22 కోచ్‌లతో నడుస్తుందని ప్రకటించారు. రాజమండ్రి నుంచి 7న సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి శుక్రవారం రాత్రి 11 గంటలకు అయోధ్యధామ్ చేరుతుందన్నారు. అదే రైలు ఫిబ్రవరి 10న అటు నుంచి బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2గంటలకు రాజమండ్రి చేరే విధంగా షెడ్యూల్ చేశారు. సామర్లకోట నుంచి అయోధ్యధామ్‌కి 07218 రైలు 11న బయలుదేరుతుంది. ఈ రైళ్లకు అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, దువ్వాడ, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా అయోధ్యకు చేరుతుందని ప్రకటించారు. దీంతో ఈ ప్రాంతం నుంచి వెళ్లే భక్తులు పెద్ద సంఖ్యలో ప్రయాణానికి సిద్ధపడ్డారు. వాస్తవంగా ఏదైనా ప్రత్యేక రైలు ప్రకటించిన మరుసటి రోజు నుంచే రిజర్వేషన్ల సదుపాయం అందుబాటులోకి వస్తుంది. కానీ మూడు రోజులు గడిచినా అయోధ్య ధామ్ ప్రత్యేక రైళ్ల రిజర్వేషనపై ఒక క్లారిటీ రాలేదు. రైళ్లు ఉపసంహరించుకున్నారా? అనే విషయంపై కూడా స్పష్టత కొరవడింది. అయితే అయోధ్యలో ఇప్పటికే భక్తులు పోటెత్తడంతో ఒకానొక సమయంలో ఆలయ తలుపులు మూసేసి విడతల వారీగా దర్శనం కల్పిస్తున్నారు. అందువల్ల అయోధ్యలో భక్తుల సంఖ్య అంచనాల ప్రకారం తేదీలు ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా ప్రత్యేక రైళ్లపై రైల్వే స్పష్టత ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. 22న ప్రాణ ప్రతిష్ఠకు ఈ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలోనే భక్తులు వివిధ మార్గాల్లో వెళ్లారు. అటు నుంచి విమానానికి రావాలని ప్లాన్ చేసుకున్నవాళ్లు అక్కడ పొగమంచు కారణంగా విమానాలు రద్దు కావడంతో రైళ్లనే ఆశ్రయించాల్సి వస్తోంది. రైళ్లలో రిజర్వేషన్లు దొరక్కపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.



జాతీయ రహదారిపై నగదు దోపిడీ

గొల్లప్రోలు రూరల్, జనవరి 25: గొల్లప్రోలు మండల పరిధిలోని జాతీయ రహదారిపై సినీఫక్కీలో నగదు దోపిడీ జరిగింది. మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని పడగొట్టి అందులో ఉన్న నగదును చోరీ చేసి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన నల్లల వీరబాబు మినపప్పు వ్యాపారం చేస్తూ ఉంటారు. బుధవారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై బయలుదేరి సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, ఎర్రవరం ప్రాంతాల్లోని కిరాణా దుకాణాల వద్దకు వెళ్లి ఇచ్చిన సరుకుకు నగదు వసూలు చేసుకున్నారు. వసూలయిన రూ.1.90 లక్షలను మోటార్‌సైకిల్ బ్యాగ్‌లో ఉంచుకుని రాత్రి ఇంటికి బయలుదేరారు. జాతీయ రహదారి 16పై ప్రయాణిస్తూ వన్నెపూడి జంక్షన్ వీఎల్ ఆగ్రో ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి పక్క నుంచి మరో మోటార్‌సైకిల్ వేగంగా రావడంతో అతను మోటార్‌సైకిల్‌తో పాటు కింద పడిపోయాడు. వెంటనే ఇద్దరు వ్యక్తులు వచ్చి మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో ఉన్న బ్యాగ్‌తో పాటు అందులో ఉన్న రూ.1.90 లక్షలను తీసుకుని పరారయ్యారు. దీనిపై వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్లజర్ల అటవీ ప్రాంతంలో పెద్దపులి



సీసీ కెమెరాకు చిక్కిన పులి

నల్లజర్ల,జనవరి 25 : ఉభయగోదావరి జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతం నల్లజర్ల మండలం పుల్లలపాడు, చీపురుగూడెం గ్రామాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్టు సమాచారం. నల్లజర్లకు చెందిన వ్యాన్ డ్రైవర్ ప్రసాద్ బుధవారం రాత్రి ఒంటిగంటకు ఏలూరు నుంచి వస్తున్నాడు. పుల్లలపాడు వీరమ్మ చెరువు వద్దకు వచ్చేసరికి బైపాస్ దాటి నిమ్మకాయల మార్కెట్ వైపునకు వెళ్లడంతో భయంతో వ్యాన్ డ్రైవర్ 100కు ఫోన్ చేశాడు. దీంతో అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు గురువారం ఉదయం ఆ మార్గాన్ని పరిశీలించారు. పెద్ద పులి జాడలను గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. నిమ్మకాయల మార్కెట్ నుంచి జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న తడికలకుంట చెరువులో నీరు తాగిన ఆనవాళ్లు ఉన్నాయి. అదే మార్గం గుండా చీపురుగూడెం ఫారెస్ట్‌లో జీడిమామిడి తోటలో సంచరిస్తున్నట్టు గుర్తించిన ఫారెస్ట్ గార్డ్ శ్రీనివాస్ చీపురుగూడెం, నల్లజర్ల, పుల్లలపాడు గ్రామస్తులను అటవీ ప్రాంతం వైపు వెళ్లవద్దని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తుందని తెలియడంతో రైతులు, మేకల కాపరులు, సామాన్య ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు.

పెద్దపులి జాడలు వాస్తవమే..శ్రీనివాస్, ఫారెస్ట్ గార్డ్

తడికలకుంట నుంచి నేరుగా చీపురుగూడెం ఫారెస్ట్‌లోని జీడి మామిడితోటలో పులి ఉన్నట్టు అంచనా వేస్తున్నాం. పెద్దపులి కనిపించినట్టు ఫోన్ రావడంతో గురువారం ఉదయం వీరమ్మ చెరువు,పుల్లపాడు నిమ్మకాయల మార్కెట్, తడికలకుంట ప్రాంతాల్లో పరిశీలించాం. పెద్ద పులి అడుగుల జాడ స్పష్టంగా ఉంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలను అటు వైపు వెళ్లవద్దని హెచ్చరించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం బోనులు ఏర్పాటు చేసి పెద్ద పులిని పట్టుకునే ప్రయత్నం చేస్తాం.

దళితులను అణగదొక్కుతున్న వైసీపీ ప్రభుత్వం

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



మాట్లాడుతున్న అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్

అంబాజీపేట, జనవరి 25: వైసీపీ ప్రభుత్వం దళితులను అడుగడుగునా అణగతొక్కుతుందని, వైసీపీ వైఫల్యాలు, దళితులకు చేస్తున్న అన్యాయాన్ని సింహగర్జన ద్వారా వివరిస్తామని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం వేమగిరిలో ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే దళిత సింహగర్జన ఏర్పాటు సందర్భంగా 500 మోటార్‌సైకిళ్లతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రాజమహేంద్రం నుంచి ప్రారంభమై బొబ్బర్లంక, రావులపాలెం మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా అంబాజీపేటలో హర్షకుమార్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. దళిత సింహగర్జనలో వైసీపీ వైఫల్యాలు, దళితులకు చేస్తున్న అన్యాయాలను వివరిస్తామన్నారు. సీఎం జగన్ సభలో ఓ దళిత మంత్రి మోకాలపై కూర్చోవడం, మరో మంత్రి అగ్రవర్ణాలు కూర్చుంటే ఆయన నిల్చుంటారన్నారు. ఇంకో దళిత ఎమ్మెల్సీ సామాజిక చైతన్య యాత్రలో సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుకుంటారని ఎద్దేవా చేశారు. టీడీపీ హయాంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేవారని, వైసీపీ ప్రభుత్వం జగన్ విద్యాదీవెన వంటి పథకాలతో పీజీ విద్యార్థులకు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. దీంతో దళిత విద్యార్థులు విద్యలో వెనుకడుగు వేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. సీఎం జగన్ దళితులపై కపట ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నారని విమర్శించారు. సింహగర్జనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జీవీ శ్రీరాజ్, నూకపెయ్యి చిన్న, మాత సత్యనారాయణ, బీర సురేష్, కత్తుల విక్టర్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5 నుంచి జాతీయస్థాయి గిరిజన ఉత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

దివాన్‌చెరువు, జనవరి 25: జాతీయస్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరుగుతాయని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్ తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కులప్పనాయక్ మాట్లాడుతూ ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆదివాసీ గిరిజన కళాకారులచే గిరిజన సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని అక్కులప్పనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, గిరిజన ఎమ్మెల్యేలు. ఎమ్మెల్యే జక్కంపూడిరాజా, జక్కంపూడి విజయలక్ష్మి, నన్నయ వీసీ, రిజిస్ట్రార్ అధ్యాపకులు పాల్గొంటారని చెప్పారు. రాజానగరం, రాజమహేంద్రవరం ప్రజలు ఈ ఉత్సవాలను, గిరిజన సాంస్కృతిక వైవిధ్యాలను వీక్షించి ఆనందించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిభాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణునాయక్, రాజ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ దొర, జాన్‌వెస్లీ, చిన్నా, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

అధునాతన కృత్రిమ మేధాశక్తితో మార్పులు తీసుకురావాలి



వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ప్రతినిధులు

రాజానగరం, జనవరి 25: అధునాతన కృత్రిమ మేధాశక్తితో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి కృషి చేయాలని రాజమహేంద్రవరం సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ ఆకాంక్షించారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో గురువారం నిర్వహించిన కిసాన్ మేళా సదస్సుకు కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (ఐకార్-సీటీఆర్ఐ) రాజమహేంద్రవరం డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేవీకే మహిళా సాధికారత దిశగా ఎన్నో వినూత్న కార్యక్రమాలు, వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ప్రధానంగా షెడ్యూల్డ్ కులాల మహిళలకు కొబ్బరిపీచు, జనపనారతో వివిధ రకాల ఉత్పత్తుల తయారీలో నైపుణ్య శిక్షణను కల్పిస్తూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ ఉప ప్రణాళిక నిధుల ద్వారా కేవీకే అందజేస్తున్న శిక్షణా కార్యక్రమాలను ఎస్సీ రైతులు, రైతు మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీసీఎన్ఎఫ్ డీసీఎం బి.తాతారావు మాట్లాడుతూ యువత సాఫ్ట్‌వేర్ రంగంతో పాటు వ్యవసాయ రంగంపై ఆసక్తి చూపాలన్నారు. కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా పనిముట్లను వివిధ మండలాల్లోని ఎస్సీ రైతులకు, మహిళలకు అందజేస్తున్నామన్నారు..ఈ సందర్భంగా కేవీకేలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ ప్రారంభించారు. అనంతరం కిసాన్ మేళా సందర్భంగా ఎస్సీ రైతులకు, మహిళలకు వివిధ రకాల పనిముట్లు అందజేశారు. కేవీకే సిబ్బంది జేవీఆర్ సత్యవాణి, దిలీప్, ఎంఏ రాజు, విజయ వర్ధన్, జె.ప్రభాత్, ఆర్.రత్నాజీ, పంచాయతీ కార్యదర్శి వీవీ రమణ కుమారి, రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల సభ్యులు (పందూరు), కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్..

కిసాన్ మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ రకాలైన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. అలాగే ప్రకృతి వ్యవసాయంతో (ఏపీసీఎన్ఎఫ్) అనుసంధానంగా పండించిన వివిధ రకాల దేశవాళీ వరి రకాలు, పంటల సస్యరక్షణ కషాయాలు, కూరగాయల నారు, వివిధ ఉత్పత్తులు, యూనిట్ల ప్రదర్శన అబ్బుర పరిచింది. అలాగే ట్రాక్టర్ ద్వారా నడపబడే అనేక వ్యవసాయ పనిముట్లను ప్రదర్శించి, వాటి ఉపయోగాలను, రైతులకు, విద్యార్థులకు వివరించారు.

పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేకనే మెడికో ఆత్మహత్య



సర్పవరం జంక్షన్, జనవరి 25: వైద్యురాలు కావాలన్న కోరికతో కష్టపడి..ఇష్టంతో ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆ విద్యార్థి పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేకపోయింది. తనువు చాలించాలని నిర్ణయించుకుంది. చదువు మధ్యలో మానేసి కుటుంబ సభ్యులను నిరాశకు గురి చేయలేక..ఏం చేయాలో పాలుపోని స్థితిలో జీవితంపై విరక్తితో సముద్రంలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాకినాడ సూర్యనారాయణపురం రంగయ్యనాయుడువీధికి చెందిన వంకధారి శ్వేత (25) ఇంటర్ అనంతరం నీట్‌లో ఓపెన్ కేటగిరీలో 714 ర్యాంకు సాధించి ప్రతిష్టాత్మక కాకినాడ రంగరాయ వైద్య కళాశాల్లో ఎంబీబీఎస్‌లో 2018-19 విద్యా సంవత్సరంలో సీటు సాధించింది. రోజూ ఇంటినుంచే మెడికల్ కాలేజీకి వెళ్లి వస్తుంటుంది. ఎంబీబీఎస్‌లో తొలి రెండేళ్లు పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించింది. మూడో ఏడాదిలో పరీక్షల పట్ల భయం ఏర్పడింది. పరీక్ష రాయాలంటేనే ఒత్తిడికి లోనవ్వడం, పరీక్షా హాలులో కళ్లు తిరిగి పడిపోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. శ్వేతకు పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు తల్లిదండ్రులు ఇంట్లోనే యోగా అభ్యసనాల సాధన, వ్యాయామం, వాకింగ్ వంటివి చేయించేవారు. ఆర్ఎంసీ అధ్యాపకులు కూడా పరీక్షలపై ఏర్పడిన భయాన్ని పోగొట్టేందుకు కౌన్సిలింగ్ చేసి భరోసా కల్పించేవారు. అయినా సరే పరీక్షలు వస్తున్నాయంటే ఎక్కడ ఫెయిల్ అవుతాననే మానసిక భావనతో ఉండేది. తరగతులకు క్రమం తప్పకుండా రావడం, వినడం అన్నీ చేసేదని, పరీక్షలు వచ్చాయంటే ఆత్మన్యూనతా భావానికి గురై ఆందోళనకు గురయ్యేదని సహచర వైద్య విద్యార్థులు తెలిపారు. పరీక్షలపై ఉన్న భయంతోనే శ్వేత ఆత్మహత్యకు పాల్పడినట్లు తిమ్మాపురం ఎస్ఐ షేక్ షరీఫ్ తెలిపారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

12 మంది ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతి

ఏలూరు క్రైం, జనవరి 25 : ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న ఎస్ఐలలో సీనియారిటీని బట్టి 12 మందికి సీఐలుగా పదోన్నతులు కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో వి.వెంకటేశ్వరరావు (తూర్పుగోదావరి జిల్లా), జి.కాశీచరణ్ (కోస్టల్ సెక్యూరిటీ పోలీస్), గోవాడ వెంకటేశ్వరరావు (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా), నామాల మురళీకృష్ణ (తూర్పుగోదావరి జిల్లా), సీహెచ్ గోపాలకృష్ణ (కాకినాడ జిల్లా), వాసిరెడ్డి శ్రీను (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ), బొర్రా నరసింహమూర్తి (తూర్పుగోదావరి జిల్లా), బీర సత్యనారాయణ (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ), లోకవరపు గౌరీనాయుడు (సీఐడీ), జిల్లెళ్ళ జేమ్స్‌రత్నప్రసాద్ (సీఐడీ), ఏలేటి చిట్టిబాబు (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ), చలమూరి ప్రకాష్ (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ) ఉన్నారు. వీరికి ఒకటి రెండు రోజుల్లో పోస్టింగులు కల్పించనున్నారు.

సందేశాత్మకంగా నాటికలు



ఇంద్రప్రస్థం నాటికలో ఓ సన్నివేశం

పెద్దాపురం, జనవరి 25: ప్రజల జీవితాలను ప్రతిబింబించేదే కళ అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జ్యోత్స్నల కృష్ణబాబు అన్నారు. పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి నాటికల పోటీలు రెండోరోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మన పెద్దాపురం ఫేస్ బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్, స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, యింధన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు పాల్గొన్నారు.

విలువలను తెలియచేసిన ఇంద్రప్రస్థం..

అభినయ ఆర్ట్స్ (గుంటూరు) గోపీ సత్యప్రకాష్ రచనలో రవీంద్రరెడ్డి దర్శత్వంలో ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. ప్రేమ అనేది సృష్టిలో ఎంతో గొప్పదని కానీ ఆ ప్రేమలు హర్షించేలా కనిపించాలే తప్ప అనాలోచిత నిర్ణయాలతో వెర్రిగా పరుగులు పెట్టకూడదనే సందేశాన్ని ఇచ్చారు.

సమాజాన్ని ప్రశ్నించిన రైతే రాజు నాటిక

దేశం వెలుపల జవాన్, దేశం లోపల కిసాన్.. వీళ్లు లేకపోతే మొత్తం దేశమే లేదు, ప్రపంచాన్ని అరచేతిలో ఉన్న సెల్‌ఫోన్ శాసిస్తున్న ప్రస్తుత తరుణంలో పిడికెడు అన్నం లేకపోతే బతకలేం అనే సందేశంతో సాగిన రైతే రాజు నాటిక ఆకట్టుకుంది. హైదరాబాద్ కళాంజలి సంస్థ ప్రదర్శన ఇవ్వగా కంచర్ల సూర్యప్రకాష్ రచించారు. కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. అలాగే రాఘవ మూవీ మేకర్స్ (గుంటూరు) వారి కెరటాలు నాటిక కూడా ఎంతగానో ఆకట్టుకుంది.

వైఎస్ఆర్ వర్సిటీతో ఒప్పందం

కడియం, జనవరి 25: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ సంఘంతో వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, నర్సరీ సంఘం డైరెక్టర్లు గురువారం వైఎస్సార్ ఉద్యానవిశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ టి.జానకీరామ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సరీ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందిస్తూ దేశవిదేశాల వాణిజ్యంలో తగిన పోటీ ఇచ్చేలా ఉండాలని, రైతుకు కావాల్సిన అవసరాలను, సాంకేతిక నిపుణుల అభిప్రాయాలను అనుసరించి రైతులకు కొత్త వంగడాల రూపకల్పన చాలా అవసరమని భావించి తాము వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ టి.జానకీరామ్‌ను కలిసి ఈ ఒప్పందాన్ని చేసుకున్నట్లు తెలిపారు. నర్సరీసంఘం ఉపాధ్యక్షుడు పెనుమాక కొండబాబు, కార్యదర్శి గాదనాగేశ్వరరావు, కోశాధికారి తాడాల బాలమురళీకృష్ణ, సహాయ కోశాధికారి జంగా సుబ్బారావు, పీఆర్‌వో గరగ నాగేశ్వరరావు, డైరెక్టర్లు తాడాల నాగేశ్వరరావు, కొండేపూడి నాగు, వడ్లమూరి రాజేష్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి

తుని రూరల్, జనవరి25: గొల్లప్రోలు, రావికంపాడు రైల్వేస్టేషన్ల మధ్యలో రావికంపాడు వద్ద గుర్తు తెలియని రైలు నుంచి మహిళ జారిపడి మృతి చెందింది. స్థానికులు రైల్వే స్టేషన్‌లో సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని తుని రైల్వే పోలీసులు పరిశీలించారు. మహిళ జార్ఖండ్‌కు చెందిన సరోట దేవిగా గుర్తించి మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉత్సవాలకు రథం సిద్ధం



అంతర్వేది, జనవరి 25: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు మాఘ మాసం ఫిబ్రవరి 16 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించే రథోత్సవానికి రథాన్ని సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గురువారం షెడ్డులో నుంచి రథాన్ని బయటకు తీసుకువచ్చి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉంచారు. రంగులు వేసి ఆర్అండ్‌బీ అధికారులు ఇచ్చిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో రథసప్తమి నాటికి రథాన్ని సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వాహనకారులు, అగ్నికుల క్షత్రియులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ధర్నాకు వేగుళ్ల సంఘీభావం

మండపేట, జనవరి 25: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండపేట పట్టణ, మండల విశ్రాంత ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా చేపట్టారు. శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. టీడీపీ ప్రభుత్వంలో తమకు మేలు జరిగిందని, వైసీపీ ప్రభుత్వం తమకు రావాల్సిన బెనిఫిట్స్‌లో కోతలు విధించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభు త్వం రద్దుచేసిన పథకాలను టీడీపీ ప్రభుత్వం అధికారంలో రాగానే పునరుద్ధరిస్తామన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, జనవరి25: ఓటర్లంతా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా, నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ముమ్మిడివరం నియోజకవర్గ ఓటరు నమోదు అధికారిణి జి.సత్యవాణి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, పీపుల్ సర్వీసు ఆర్గనైజేషన్, చైతన్యవలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో గురువారం ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి జడ్పీ బాలిక ఉన్నత పాఠశాల వరకు ఓటరు నమోదు అవగాహన ర్యాలీ నిర్వహించారు. హైస్కూలు సెంటర్‌లో మెయిన్ రోడ్డుపై మానవహారం నిర్వహించి ఓటుహక్కు వినియోగంపై అవగాహనకల్పించారు. విద్యార్థులకు ఓటరు నమోదు, ఓటుహక్కు విలువ, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి అంశాల్లో వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. తహసీల్దార్ సీహెచ్‌విజయశ్రీ, కమిషనర్ జి.లోవరాజు, కన్నీడి వెంకటేశ్వరరావు, రాంజీ, హెచ్ఎం సీహెచ్ పరిమళ, ఆర్గనైజేషన్ సభ్యుడు సీహెచ్.శ్రీనివాసరావు, కేటీవీ కిశోర్, మహిళాడిగ్రీ తారా కళాశాల, ఉపాకిరణ్ ఐటీఐ, బాలికోన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. చినకొత్తలంకలో సర్పంచ్ కొత్తూరి ఉమారాణి ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. పీటీవీ వర్మ, పొత్తూరి వీణారాణి పాల్గొన్నారు. ముమ్మిడివరంలో జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఓటరుదినోత్సవ కార్యక్రమంలో డీఈవో ఎం.కమలకుమారి, హెచ్ఎం బి.హనుమంతరావు పాల్గొన్నారు.

అంబాజీపేట: 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని వైస్ ఎంపీపీ సుదాబత్తుల లక్ష్మీభార్గవి అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తొలుతహైస్కూల్, విద్యార్థులుఓటు హక్కుపై ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఇన్‌చార్జ్ తహసీల్దారు నాగపద్మలక్ష్మి, ఆర్ఐ ఇబ్రహిం, టీడీపీ నాయకుడు నాగాబత్తుల వెంకటసుబ్బారావు, హెచ్ఎం కడలి సాయిరామ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు పంచాయతీల పరిధిలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు.

కొత్తపేట: ఓటర్లు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి కోరారు. గురువారం వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఓటు హక్కుపై చైతన్యం కలిగిస్తూ ర్యాలీ జరిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ సిటిజన్లు, మహిళలు, దివ్యాంగుల ఓటర్లను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.పెద్దిరాజు, తహసీల్దారు జీడీ కిషోర్‌బాబు, డిప్యూటీ తహసీల్దారు ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెంలోని లిధియా ఫార్మసీ కళాశాలలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ గొల్లపల్లి శ్రీధర్, ప్రిన్సిపల్ ఎస్.మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యానాం: ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూఓటు విలువ తెలుసుకోవాలని ఓటర్ల నమోదు అధికారి, పరిపాలనాధికారి మునిస్వామి అన్నారు. గురువారం యానాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యానాం ఎన్నికల శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. పలువురు ఉత్తమ బూత్ లెవిల్ అధికారులను సత్కరించారు. సెక్టారు అధికారులు, కళాశాల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కె.గంగవరం: ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కె.గంగవరంలో తహసీల్దార్ టి.వైద్యనాథ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఓటు విలువను ప్రజలకు తెలియజేస్తూ కె.గంగవరం పురవీధుల్లో ర్యాలీ చేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాస్, వీఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని 12గ్రామాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించడంతో పాటు ఓటుహక్కుపై నూతన ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీని పట్టణంలో ఆర్డీవో సుధాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత పట్టణంలో మానవహారం ఏర్పడి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఓటుహక్కు ప్రాధాన్యతను ఆర్డీవో వివరించారు. ముగ్గులు పోటీలు, వక్తృత్వం పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. తహశీల్దారు ఎం.వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దారు జి.శ్రీనివాసు, రెవెన్యూ, మున్సిపాల్ సిబ్బంది, మోడరన్, వీఎస్ఎం, కిట్స్ కళాశాల విద్యార్థులు, పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక గ్రేస్‌డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ జీఆర్ ఠాగూర్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థినులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడి ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఎస్ఐ హరికోటి శాస్త్రి, ఎంఈవో కె.హెలీనా, డిప్యూటి తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, వీఆర్వో తోట శ్రీను, కళాశాల కరస్పాండెంట్ శ్రీచరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండపేట: మండపేటలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. యువత ఓటు హక్కు వినియోగించుకోవాలని మండపేట నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి మదనమోహనరావు, తహసీల్దార్ టి.రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ అన్నారు. స్థానిక విజ్ఞాన్ కళాశాలలో ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఓటు విలువ గురించి విద్యార్థులకు వివరించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఐదం రాజు, ఎంఈవో పాల్గొన్నారు.

మామిడికుదురు: ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ కోరారు. ఓటు హక్కు దినోత్సవాన్ని మామిడికుదురు హైస్కూల్‌లో, దీప్తి స్కూల్‌లో నిర్వహించారు. ముగ్గులపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఓటు హక్కు విశిష్టతను విద్యార్థులకు వివరించి ప్రతిజ్ఞ చేయిం చారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ కె.శరణ్య, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, దీప్తి కళాశాల కరస్పాండెంట్ ఈవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

చిత్తడి నేలలు సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

అంతర్వేది, జనవరి 25: చిత్తడి నేలలు సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.కమలకుమారి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్, పాఠశాల విద్యాశాఖ, అటవీశాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలల సంరక్షణ అవగాహన కార్యక్రమాన్ని అంతర్వేది సెయింట్ మేరీ స్కూలులో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు, పది పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు, వంద మంది ఉపాధ్యాయులతో చిత్తడి నేలల సంరక్షణపై జిల్లాస్థాయి అవగాహన ర్యాలీ జరిగింది. సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న విపరీతమైన మార్పులకు దుర్వినియోగమే ప్రధాన కారణమన్నారు. డీసీఈబీ సెక్రటరీ వి.హనుమంతరావు మాట్లాడుతూ నీటి మడుగులను కాపడడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను నదుల్లో వేయడం వల్ల జలవనరులు కలుషితం అవుతున్నాయని డీఎస్‌వో సుబ్రహ్మణ్యం అన్నారు. భావి తరాలకు చక్కని వాతావరణంతో కూడిన భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత నేటి బాలలపైనే ఉందని ఏపీ ఎన్జీసీ స్టేట్ మోనటరింగ్ అధికారి జి.ప్రభావతి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు జిల్లాల్లో చిత్తడి నేలల పరిరక్షణకు అనేక అవగాహన ర్యాలీలు నిర్వహించినట్టు తెలిపారు.

ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను పూర్తిచేయాలి

అమలాపురం టౌన్, జనవరి 25: ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలను సత్వరం పూర్తిచేసి పాలనాపరంగా అందుబాటులోకి తీసుకు రావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. తొలుత కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన బదిలీలు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాల కల్పన తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారుల అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. జేసీ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎ.బోసుబాబు, ఏడీలు కాకి నాగేశ్వరరావు, వెంకటరామారావు, షంషీ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పాల్గొన్నారు.

మానవాళి అభ్యున్నతికి వేదాలే ప్రామాణికం

అమలాపురం టౌన్, జనవరి 25: మానవాళి అభ్యున్నతికి వేదాలే ప్రామాణికంగా నిలుస్తాయని శృంగేరి ఆస్థాన విద్వాంసులు విశ్వనాథ గోపాలశాస్త్రి పేర్కొన్నారు. మానవాళి మనుగడకు, అనుసరించాల్సిన మార్గాలను వేద విభజన ద్వారా వివరించారన్నారు. శ్రీపాద శ్రీరామనృసింహ ఘనాపాఠీ ఘన ట్రస్టు విద్వత్సభ గురువారం డాక్టర్ బులుసు వ్యాఘ్రేశ్వరుని ఆధ్వర్యంలో అమలాపురంలో నిర్వహించారు. దెందుకూరి వేంకటేశ్వర పౌండరీక యాజులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలకు చెందిన ఘనాపాఠీలు 70మంది పాల్గొన్నారు. వేదమంత్రాల్లో ఉన్న అర్థాలను, పరమార్థాలను కడియాల సీతారామ ఘనాపాఠి వివరించారు. వేదస్వస్తి నిర్వహించారు. వేద ఘనాపాఠీలను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్య ఘనాపాఠి, జొన్నవిత్తుల చంద్రశేఖర్ ఘనాపాఠి, సామవేదం సూర్యనారాయణమూర్తి, గుళ్లపల్లి చిన ఆంజనేయ ఘనాపాఠి, గొల్లపల్లి సుబ్రహ్మణ్య ఘనాపాఠిలతో పాటు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ఎస్ఆర్ మూర్తి, వెంకటరమణ, లక్ష్మీపతిశాస్త్రి, గుళ్లపల్లి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు



ఆత్రేయపురం: ర్యాలిలో గూడపాటి శేఖర్, ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 50మంది గురువారం టీడీపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, పాలంగి రవిచంద్ర, గూడపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఆకలి కేకలు


భోజనాల కోసం ఎదురు చూస్తున్న క్రీడాకారులు

అమలాపురంటౌన్, జనవరి25: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో కనీస సదుపాయాలు కల్పించట్లేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో నియోజకవర్గ స్థాయిలో మహిళలు, పురుషులు విభాగాల్లో కబడ్డీ పోటీలు నిర్వహించారు. అల్లవరం, ఉప్పలగుప్తం, అవ లాపురం మండలాల నుంచి ఆరు జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.30గంటలైనా క్రీడాకారులకు భోజనాలు రాకపోవడంతో ఎదురుచూసి ఆకలి కేకలతోనే వెనుదిరిగారు. క్రీడా ప్రాంగణంలో కనీసం ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా ఏర్పాటు చేయలేదు. పీఈటీలు, పీడీలు టీ, టిఫిన్లను వారి సొంత డబ్బులతోనే తెచ్చుకున్నారు.

ఓడలరేవు బీవీసీలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇంటెలిజెంట్ హెల్త్‌కేర్ కంప్యూటేషన్, న్యూరల్ మెడలింగ్ కంప్యూటర్ సైన్సు తరగతుల అంతర్జాతీయ కాన్ఫరెన్స్ జరిగింది. 150పరిశోధనా పత్రాలు వచ్చాయి. 64అంగీకరించి 59 మంది ప్రెజెంటేషన్ రిజిస్ట్రేషన్ పొందారు. డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ బీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ పి.సుబ్బారావు ప్రసంగించారు. మొదటి రోజు సదస్సులో సెక్రటరీ బోనం కనకయ్య, ఛైర్మన్ బోనం కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌పి చంద్రమౌళి, డాక్టర్ టీవీ జనార్దనరావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా గుర్రాల



కె.గంగవరం, జనవరి 25: రాజమండ్రి టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా పామర్రుకు చెందిన బీజేపీ నాయకుడు గుర్రాల సత్యనారాణ నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం అప్పగించిన పనిని నిస్వార్థంగా పనిచేస్తానని చెప్పారు.

షర్మిల సభకు బయలుదేరిన నాయకులు

కాట్రేనికోన, జనవరి 25: కాకినాడలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సభకు మండలం నుంచి బైక్‌ర్యాలీతో తరలి వెళ్లారు. ముమ్మిడివరం నియోజకవర్గ పార్టీ కన్వీనర్ గెడ్డం సురేష్‌బాబు ఆధ్వర్యంలో కాట్రేనికోనలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ ప్రారంభించారు. కాకినాడసభలో పాలెపు ధర్మారావు, మల్లాడి గోపి, లంకే నాగరాజు, రేవు బాబి, ఓలేటి ధర్మారావు, పాలెపు సత్తిరాజు, పాలెపు శ్రీనురాజు, మరో 20మంది కాంగ్రెస్‌లో చేరారు.

ఎస్సీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారు


మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ కమిషన్ సభ్యుని ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న జంగా బాబూరావు

అమలాపురం రూరల్, జనవరి 25: ఎస్సీలను విభజించి కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా సీఎం జగన్ ఎస్సీ వర్గీకరణ చేసేశారని దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు పేర్కొన్నారు. మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్లను ఏర్పాటుచేసినా ఇంత వరకు ఆయా కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో గురవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చల్లం ఆనంద్‌ప్రకాష్ దళిత ప్రజాప్రతినిధులతో పాటు దళిత నాయకులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు బాబూరావు, నక్కా చంద్రశేఖర్, కృష్ణ, నక్కా సంపత్‌కుమార్ ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితపేటల్లో కనీసం మంచినీటి కుళాయిలు కూడా వేసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇక రోడ్లు, డ్రెయిన్ల మాటే లేదని వివరిస్తుండగా ఆనంద్‌ప్రకాష్ కల్పించుకుని ఎస్సీల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం రూ.62 వేలకోట్లు ఖర్చు పెట్టిందని చెప్పారు. అలాగైతే గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదేమిటని ప్రశ్నించారు. స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయలేదని, గతంలో కాంగ్రెస్‌కు పనిచేసిన దళితులు జగన్‌ను నమ్మి గద్దెనెక్కించిన విషయాన్ని గుర్తించాలని బాబూరావు పేర్కొన్నారు. దళితుల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లాలని అవసరమైతే దళిత సంఘాల నాయకులను సీఎంతో సమావేశపరిస్తే అన్ని సమస్యలను వివరిస్తామన్నారు. పౌర హక్కుల దినోత్సవాలు నిర్వహించట్లేదని సభ్యులు పేర్కొనగా అవసరమైతే ఆయా శాఖల అధికారులను కమిషన్ ముందుకు తీసుకువస్తామని ఆనంద్‌ప్రకాష్ పేర్కొన్నారు. బండారులంక సచివాలయాన్ని తొలుత ఆయన పరిశీలించారు. సమస్యలను సర్పంచ్‌లు తిరుకోటి సుజాత, పెనుమాల సునీత, దాసరి అరుణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పొలమూరి బాలకృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

మట్టి, ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి

పిగన్నవరం, జనవరి 25: మండలంలో లంకప్రాంతాలు నుంచి అక్రమంగా తరలిపోతున్న ఇసుక, మట్టి రవాణాను వెంటనే నిలిపి వేయాలని టీడీపీ, జనసేన శ్రేణులు డిమాండ్ చేశారు. వై.వి.పాలెం సతీష్ చంద్ర వారధిపై గురువారం ధర్నా నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని వారు ఆరోపించారు. సతీష్ చంద్ర వారధిపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో వంతెన శిథిలావస్థకు చేరుకుందన్నారు. యర్రంశెట్టి వీరస్వామినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మద్దా చంటిబాబు, జనసేన జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, ఇరుపార్టీల మండల అధ్యక్షులు తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, కొమ్ముల శ్రీను, నక్కా వీరవెంకట సత్యనారాణ, పెచ్చెట్టి వెర్రియ్య, అంబటి కోటేశ్వరరావు, శేరు శ్రీనుబాబు, నారిన సత్తిపండు, తాటికాయల వెంకటేష్, మేడిద పద్మనాభరావు పాల్గొన్నారు.

నేడ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

మండపేట, జనవరి 25: స్థానిక కరచీ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాలను శుక్రవారం మంత్రులు మెరుగ నాగార్జున, పినిపే విశ్వరూప్, ఆదిమూలం సురేష్, ఎంపీ చింతా అనురాధ, జూపూడి ప్రభాకర్ ఆవిష్కరిస్తారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. ఎస్సీ కాలనీల్లో కనిపించే విగ్రహాలను మెయిన్‌రోడ్డులో ఆవిష్కరించనున్నడంపై వైసీపీ పట్టణ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్ మందపల్లి రవి, ఉండ్రాజవరపు అర్జున్, సన్నాల ధనరాజు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలిఖాన్‌బాబా, ఎం.శ్రీనివాస్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

కపిలేశ్వరపురం, జనవరి 25: విద్యాభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గురువారం టేకి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామసర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షతన జరిగిన విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను ఆయన అందించారు. ఎంఈవో కె.తాతారావు, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణిదుర్గారావు, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి సూరిబాబు, పుట్టా కృష్ణమూర్తి, పాఠశాల హెచ్ఎం ప్రసాద్, కార్యదర్శి సత్తిబాబు పాల్గొన్నారు.



గవర్నర్ నుంచి బీఎల్‌వో అవార్డు అందుకుంటున్న అల్లవరం మండలం తాడికోన వీఆర్వో యింటి హరిదుర్గాప్రసాద్

వైసీపీ విద్యార్థి విభాగం ర్యాలీలో జై జనసేన



జైజనసేన.. జైపవన్‌కల్యాణ్ అంటూ వెనుదిరిగిన విద్యార్థులు

అమలాపురం టౌన్, జనవరి 25: విద్యార్థుల సాధికారిత జగనన్నతోనే సాధ్యమంటూ వైసీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గురువారం అమలాపురం హైస్కూలు సెంటరు నుంచి ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు పాముగంటి చైతన్య, రీజనల్ కోఆర్డినేటర్లు లక్కాపుల రాజశేఖర్‌రెడ్డి, జిల్లా నేతలు జిల్లెల్ల రమేష్, వింటి రాజా, మణికుమార్ ఆధ్వర్యంలో డీజేలతో చేపట్టిన ర్యాలీలో జూనియర్ కళాశాలల విద్యార్థులకు పార్టీ పతాకాలు ఇచ్చి నడిపించారు. బలవంతంగా ర్యాలీకి తీసుకువచ్చా రంటూ నల్లవంతెన వద్దకు వచ్చేసరికి పలువురు విద్యార్థులు జైజనసేన, జై పవన్ కల్యాణ్ అంటూ వెనుదిరిగారు. ఓటు హక్కురాని విద్యార్థులకు సైతం పార్టీ పతాకాలు ఇచ్చి ర్యాలీ నిర్వహించడంపై పలువురు గుసగుసలాడుతున్నారు.

ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన భువనేశ్వరి

ఉప్పలగుప్తం, జనవరి 25: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం చల్లపల్లి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గోపవరంలో అమలాపురం మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు ఇంటి వద్ద తన తండ్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. బుచ్చిమహేశ్వరరావు కుమార్తె సత్యశ్రీ, భార్య ఇందిర భువనేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో బుచ్చిమహేశ్వరరావుతో పాటు టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి హరీష్‌మాధుర్, పెయ్యల దుర్గారావు, చిక్కం కాసు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన బండారు



కొత్తపేట, జనవరి 25: నిజం గెలవాలి పర్యటనలో భాగంగా అమలాపురం విచ్చేసిన చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని సత్యనారాయణ గార్డెన్స్ వద్ద టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: గుంటూరు కారం
వెంకటరమణ	: సైంధవ్
శ్రీలలిత	: గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: గుంటూరు కారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

ఉత్తమ బీఎల్‌వోగా విష్ణు

ద్రాక్షారామ, జనవరి 25: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని చోడవరం గ్రామ వీఆర్వో పంపన విష్ణుమూర్తి ఉత్తమ బీఎల్‌వో పురస్కారాన్ని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సుధాసాగర్ చేతులమీదుగా అందుకున్నారు. ఈసందర్భంగా విష్ణుమూర్తిని పలువురు అభినందించారు.

మహిళలకు ఆసరా చెక్కులు అందజేత

మలికిపురం, జనవరి 25: ఇచ్చిన హామీ ఇచ్చిన ప్రకారమే డ్వాక్రా మహిళలకు నాల్గోవిడత ఆసరా నగదును సీఎం జగన్ అందజేశారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలో 1385సంఘాలకు రూ.49కోట్లు అందించామన్నారు. అడబాల బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగి కార్యక్రమంలో జడ్పీ టీసీలు బళ్ల ప్రసన్నకుమారి, దొండపాటి అన్నపూర్ణ, సుమలత, మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, సుంకర బాబ్జి, కంచర్ల శేఖర్, పాటి శివ, ఆర్.వెంకట్, కె.అశోక్, ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల ధర్నా

కొత్తపేట, జనవరి 25: రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షన్‌దారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేశారు. తహసీల్దారు జీడీ కిషోర్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. సంఘ అధ్యక్షుడు యేడిద సత్తిరాజు, ర్యాలి సూర్యకుమారి, మాకే నరసింహమూర్తి పాల్గొన్నారు.

టీడీపీ బీసీ సెల్ కార్యదర్శిగా బాలుయాదవ్

కాట్రేనికోన, జనవరి 25: టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శిగా చెయ్యేరుకు చెందిన మందపాటి బాలకృష్ణ(బాలుయాదవ్) నియమితులయ్యారు.అధిష్ఠానం నుంచి ఉత్తర్వులందినట్టు యాదవ్‌ప్రకటించారు. పార్టీజాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఉప్పలగుప్తం, జనవరి 25: నంగవరంలో సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకే భవనాలను ప్రారంభించారు. నంగవరం కాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గొల్లవిల్లిలో నాల్గవవిడతగా రూ.9,20,34,936 ఆసరా చెక్కును విడుదలచేశారు. వైసీపీ మండల అధ్య క్షుడు బద్రి బాబ్జీ, ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ దంగేటి డోలామణిరుద్ర, సర్పంచ్‌లు జొన్నాడ చిన్నా, చిక్కం జంగమయ్య, పెయ్యల రాజ్‌కుమార్, ఎంపీటీసీ వంగా గిరిజానాగకుమారి, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి, వెలుగు ఏపీఎం భూపతివర్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

అల్లవరం, జనవరి 25: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ గురువారం శ్రీకారం చుట్టారు. గోడి నుంచి గుండెపూడి వరకు రూ.5.40కోట్లతో బీటీ రోడ్డుపనులకు, బోడసకుర్రు నుంచిబెండమూర్లంక వరకు రూ.8.12కోట్లతో ఏటిగట్టు రోడ్డు పనులకు, గోడిలంకలో రూ.45 లక్షలతో జలజీవన్‌మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, తహసీల్దారు ఎన్ఎస్ఎస్ ప్రసాద్, ఎంపీడీవో కృష్ణమోహన్, రుద్రరాజు నానిరాజు, చెల్లుబోయినశ్రీనివాస్, సర్పంచ్‌లు రాయుడు విష్ణుత్రిమూర్తులు, రుద్రరాజు పవిత్ర, రొక్కాల విజయలక్ష్మి, చిట్టినీడి శ్రీదేవి, తోట శ్రీదేవి, బర్రే సీతారత్నం, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీలు పి.రాజేశ్వరి, దొమ్మేటి శాంతిశ్రీభవాని, బసవాని పద్మ, మాకే కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు మోడరన్ ప్రజాహిత అవార్డు

రామచంద్రపురం, జనవరి 25: ప్రభుత్వ, సామాజిక, రాజకీయ, క్రీడా, కళ, సేవా విద్యా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారికి మోడరన్ ఫౌండేషన్ అందిస్తున్న ప్రజాహిత పురస్కారాన్ని రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్‌కు గురువారం మోడరన్ అధినేత జీవీరావు అందజేశారు. ఈసందర్భంగా వయోవృద్ధులు, దివ్యాంగులైన ఓటర్లకు 20వీల్‌చైర్లను అందజేయనున్నట్లు జీవీరావు ప్రకటించారు. మోడరన్ డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పి.వెంకటేశ్వరరావు, సీహెచ్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, ఇంటర్ అకడమిక్ అడ్వయిజర్ సీహెచ్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ



రాయవరం, జనవరి 25: చెల్లూరులో పలు కుటుంబాలను గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. గ్రామానికి చెందిన ముత్యాల అనంతలక్ష్మి ఇటీవల మృతి చెందగా ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. కుమారుడు ముత్యాల వీవీ సత్యనారాయణ(పెద్దబాబు)ను పరామర్శించారు. గ్రామానికి చెందిన దార్ల సరోజిని, పుచ్చకాయల వీరమ్మ మృతి చెందగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, మాజీ సర్పంచ్ నూనె ఏసుబాబు, కొప్పిశెట్టి సత్యనారాయణ, కాదా శ్రీను, ముత్యాల సాయిరాం, బవిడిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ సమస్యకు పరిష్కారం

హైకోర్టు ఉత్తర్వులతో మాచవరంలో డంపింగ్ ప్రాంతానికి తరలింపు

అంబాజీపేట, జనవరి 25: మాచవరంలో ఏడాది కాలంగా ఉన్న చెత్త డంపింగ్ సమస్య ఎట్టకేలకు హైకోర్టు ఆదేశాలతో పరిష్కారమైంది. గ్రామంలోని హడ్కోకాలనీ, సంపద కేంద్ర వద్ద చెత్తను డంపింగ్ చేయవద్దని కొంత కాలంగా స్థానికులు అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అనేక సమావేశాలు ఏర్పాటుచేసి చెత్తను తరలించేందుకు ప్రయత్నాలు చేసినప్పటికి ఫలితంలేదు. దీంతో పంచాయతీ హైకోర్టును ఆశ్రయించింది. చెత్తను ఆ ప్రాంతాల్లో డంపింగ్ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈఉత్తర్వులను పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్ పోలీసులకు అందించారు. దీంతో పోలీస్ బందోబస్తుతో మాచవరంలో ఉన్న చెత్తను ఆయా ప్రాంతాలకు తరలించి డంపింగ్ చేశారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

ఐ.పోలవరం, జనవరి 25: వచ్చే ఎన్నికల్లో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని మాదిగల పొలిటికల్ జేఏసీ సమావేశం కోరింది. మురమళ్ల చెయ్యేటివారిపేటలో ముమ్మిడివరం నియోజకవర్గం జేఏసీ నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈనెల28న పి.గన్నవరంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చెయ్యాలని సమావేశం పిలుపునిచ్చింది. వచ్చే ఎన్నికల్లో మాదిగలకు ఒకపార్లమెంటు, తగినన్ని అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని నాయకులు కోరారు. సమావేశంలో జేఏసీ ఛైర్మన్ చుట్టుగుళ్ళ నీలకంఠం, గౌరవ అధ్యక్షుడు ఆకుమర్తి చిన్న, ఆకుమర్తి ఆశీర్వాదం, వీది లోవరాజు, చెయ్యేటి శ్రీనుబాబు, ఆకుమర్తి శ్రీను, బడుగు సాయి పాల్గొన్నారు.

మాదిగలకు సీట్లు కేటాయించాలి

పి.గన్నవరం. జనవరి 25: సార్వత్రిక ఎన్నికల్లో రిజర్వుడ్ స్థానాల్లో మాదిగలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. పి.గన్నవరంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ రాజకీయ నాయకులు తవిటికి రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈనియోజకవర్గం కాని వ్యక్తి ఈనెల28న పి.గన్నవరంలో నిర్వహిస్తున్న మాదిగల రాజకీయ సమావేశానికి ఎవరూ హాజరుకారాన్నారు. చుట్టుగుళ్ల కిషోర్, పెదపూడి శ్రీను, చేట్ల రామారావు, కొండేటి నానిబాబు, తవిటికి బుజ్జి, పెదపూడి రాము, తొత్తరమూడి ఆనంద్, దిగుమర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాత మొల్లేటి సేవలు చిరస్మరణీయం

మామిడికుదురు, జనవరి 25: అప్పనపల్లి బాలబాలాజీ ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి సేవలు చిరస్మరణీయమని ధర్మకర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఏసీ జి.మాధవి అన్నారు. రామస్వామి వర్ధంతిని గురువారం దేవస్థానంలో నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఛైర్మన్ పిచ్చిక చిన్నా, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పాశర్లపూడి మహిళకు పురస్కారం

మామిడికుదురు, జనవరి 25: మస్కట్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాశర్లపూడి గ్రామానికి చెందిన ఆకుమర్తి రత్నకుమారి సినీ నటుడు డాక్టర్ మురళీమోహన్ నుంచి పురస్కారం అందుకున్నారు. చిరుమెగా ఫోర్స్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మస్కట్‌లో చేసిన సామాజిక సేవలకు రత్నకుమారి, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎం.రాజ్యలక్ష్మిలకు పురస్కారాన్ని అందించారు.